నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 22 ఫిబ్రవరి 2025 | NIZAMABAD

- మార్కెట్ కమిటీ అధికారులు, దళారులు కలిసి నిండాముంచుతుండ్రు
- తుట్టికి పావుషేరుకు అమ్ముకునే పరిస్థితులను కల్పించిండ్రు
- రైతులకు ఉపయోగపడని పసుపు బోర్డు ఎందుకు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు

# పసుపు రైతును దగా చేసిన కాంగ్రెస్, బీజేపీ

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 21 : కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు పసుపు రైతులను దగా చేశాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు ఉపయోగపడని పసుపు బోర్డు ఎందుకని ప్రశ్నించారు. కేంద్రం జిల్లాలో తూతూ మంత్రంగా బోర్డు ఏర్పాటు చేసిందని, ఎంఎస్‌పీ లేని బోర్డు గుండు సన్నాతో సమానమని పేర్కొన్నారు. పసుపునకు రూ.12వేలు మద్దతు ధర ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేముల మాట్లాడారు. ఒకప్పుడు పుట్టి పసుపు (రెండు క్వింటాళ్లు) అమ్మితే తులం బంగారం వచ్చేదని అన్నారు. రైతుకు ఇతర పంటలు నష్టం చేసినా పసుపు పంట ఆదుకునేదని తెలిపారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం, మార్కెట్ అధికారులు, జిల్లా మార్కెట్ కమిటీ దళారులతో కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే క్వింటాలుకు రూ.12వేలు మద్దతు ధర ఇస్తామని కాంగ్రెస్, నామమాత్రపు ఎంఎస్‌పీ లేని పసుపు బోర్డు ఏర్పాటు చేసి కేంద్రం.. రైతులను మోసం చేశాయని మండిపడ్డారు. అనివార్యమైన పరిస్థితుల్లో జిల్లా రైతులు తుట్టికి పావుషేరుకు పసుపు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

**కలెక్టర్ విచారణ చేయించాలి..**

మార్కెట్ యార్డులో పసుపు క్రయ, విక్రయాలపై కలెక్టర్ విచారణ చేయించాలని కోరారు. పసుపు ధర క్వింటాలుకు రూ.10 వేలు ఎట్టి పరిస్థితుల్లో తగ్గకూడదని, ప్రతి కుప్ప ఈ వేలంలో కొనేలా చూసే బాధ్యత కలెక్టర్‌పై ఉందన్నారు. పాలకవర్గం దళారులతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తే తాము ఊరుకోబోమని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్వింటాలుకు రూ. 12 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, మోసం చేసిందన్నారు.



**పాలకవర్గం కుట్ర!**

మార్కెట్ పాలకవర్గం, అధికారులు, దళారులు కుమ్మక్కు కావడంతో ఈ సీజన్‌లో పసుపు క్వింటాలుకు రూ.13 వేల నుంచి రూ.పదివేలకు పడిపోయిందన్నారు. రైతుల ఒత్తిడితో రూ.10 వేలు కొమ్ముకు, రూ.9 వేలు మండకు కటాఫ్ నిర్ణయించారన్నారు. కొంత పసుపునకు రూ.10వేలు ఇచ్చి, మిగతా రైతుల నుంచి కొనుగోలు చేస్తలేరన్నారు. దీంతో సదరు రైతులను దిక్కుతోచకుండా చేసి, వారి నుంచి రూ.8వేలకు మాత్రమే కొనుగోలు చేసి ముంచుతున్నారని మండిపడ్డారు. ఈ సిండికేట్ కుట్రలో పాలకవర్గం కూడా ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారని తెలిపారు.

**నామమాత్రంగా పసుపు బోర్డు**

2019 లోక్‌సభ ఎన్నికల్లో పసుపు బోర్డు ఐదు రోజుల్లో తెస్తానని చెప్పి ఎంపీ అర్వింద్ మోసం చేశారని వేముల అన్నారు. నామమాత్రపు బోర్డు తెచ్చారని పేర్కొన్నారు. పసుపు బోర్డు లేనప్పుడే రూ.18 వేలు ధర వస్తే, బోర్డు వచ్చిన తర్వాత పసుపు ధర రూ.10వేలకు తగ్గిందన్నారు. క్షీరాభిషేకాలు చేయించుకున్న ఎంపీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఎంపీ, ప్రధాని మాటలు నమ్మి ఓటేసిన రైతులను మోసం చేయడం భావ్యం కాదన్నారు. పసుపు బోర్డు వస్తే రైతుకు మద్దతు ధర రాలేదని, కానీ పల్లె గంగారెడ్డికి మాత్రం పదవి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఎంపీ అర్వింద్, బోర్డు చైర్మన్‌పల్లె గంగారెడ్డి ప్రధానిని కలిసి రూ.15 వేల మద్దతు ధర ఇచ్చే బోర్డు కావాలని డిమాండ్ చేయాలని సూచించారు. ఇదే పసుపునకు సాంగ్లిలో రూ.13,800 ధర ఎలా వస్తుందని, నిజామాబాద్‌లో ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. సాంగ్లి, నిజామాబాద్ మార్కెట్లను అనుసంధానం చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రభుత్వమే కేంద్రాలను ఏర్పాటు చేసి పసుపునకు రూ.15వేలు ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

---

- ఇసుక దందాను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం
- వక్రమార్గంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు
- తనిఖీల సమాచారం ముందస్తు చేరవేత
- అప్రమత్తమవుతున్న అక్రమార్కులు
- ఫిర్యాదులు వచ్చినా కానరాని చర్యలు
- జిల్లాలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


*జిల్లాలో కొంతకాలంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా..సంబంధిత శాఖలు చేష్టలుడిగి చూస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా అక్రమార్కులకు వంతపాడుతూ..ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని దక్కకుండా అడ్డుకుంటున్నారు. కొన్నిప్రాంతాల్లో ఇసుకాసురులతో అధికారులు చేతులు కలుపడం వివాదాస్పదమైంది. ఇసుక అక్రమ రవాణాలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొంతమంది ఎస్సైలు, సీఐలపై నిఘావర్గాల సమాచారం మేరకు పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు, కిందిస్థాయి ఉద్యోగుల పనితీరుపై కనీసం సమీక్ష చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇసుకాసురులకు అధికారులే అండదండలు అందించడంతో నదులు, వాగుల్లో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఇసుక దందా మూడు టిప్పర్లు ఆరు ట్రాక్టర్లుగా సాగుతున్నది.*

*–నిజామాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# ఇంటి దొంగలు!

ఇసుకాసురులకు అండదండలు

కనిపించని తనిఖీలు



**నిజామాబాద్** జిల్లాలో ఇసుకమాఫియా రెచ్చిపోతున్నది. సంబంధిత అధికారుల నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక రవాణాకు అడ్డూ అదుపు, రాత్రి, పగలు తేడాలేకుండా సాగుతున్నది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం విస్మయానికి గురిచేస్తున్నది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం.. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారుల తీరు, సర్కారు పనితీరును తేటతెల్లం చేస్తున్నది. ప్రజా పాలనలో అక్రమాలకు తావు లేదని సీఎం చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధమైన దుస్థితి కనిపిస్తుండడం గమనార్హం.

**అక్రమార్కులకు అండదండలు**

మోర్తాడ్ సమీపంలోని వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.ఇసుక అక్రమ రవాణాపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురించింది. రాత్రుల్లో జాతీయ రహదారి వెంట లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఇసుక తరలింపును బట్టబయలు చేసింది. వరుస కథనాలకు జడిసిన జిల్లా యంత్రాంగం చేసేది లేక..తనిఖీలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఉన్నతాధికారులతో కలిసి రంగంలోకి దిగినవారంతా అంతకు మునుపే అక్రమార్కులకు సమాచారం అందించినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన ఇసుకాసురులు అంతా సర్దుకుని వాహనాలను రహస్య ప్రాంతాలకు తరలించి, సైలెంట్ అయ్యారు. ఇది కొంతమంది రెవెన్యూ అధికారుల లీకుల వల్లే జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి.

మోర్తాడ్‌లో పోలీస్ స్టేషన్ ఎదుట నుంచే ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నది. స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీలను తనిఖీ చేసినా ఈ ఇసుక తంతు బయట పడుతుంది. కానీ పోలీసులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుడడం అనుమానాలకు తావిస్తున్నది. కండ్ల ముందే నుంచే రయ్‌రయ్ మంటూ దూసుకుపోతున్న ఇసుక వాహనాలను ఎందుకు పట్టించుకోవడంలేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఏర్గట్ల లోనూ ఇదే తంతు నడుస్తున్నది. ఏర్గట్ల మండలం బుట్టాపూర్‌లో ఇసుక, మొరం, కంకర అక్రమ రవాణా జరుగుతున్నది. బాల్కొండ నియోజకవర్గంలో భీంగల్, ఏర్గట్ల, మోర్తాడ్, బాల్కొండ, వేల్పూర్ మండలాల్లో చాలాచోట్ల వీడీసీలు రంగంలోకి దిగుతున్నాయి. ఇసుక అక్ర మ రవాణాలో సంబంధీకులే ముందుండి అగ్రస్ పాట పాడుతున్నారు. అక్రమార్కులకు ఇసుకను వేలం ద్వారా అప్పగిస్తున్నారు. లేదంటే ట్రాక్టర్‌కు కొంత చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో జరుగుతున్న ఈ దోపిడీ చట్ట వ్యతిరేకం. అయినప్పటికీ పోలీసులు, రెవెన్యూ శాఖలకు చెందిన వారంతా వీరికే ప్రాధాన్యతనివ్వడం గమనార్హం.

**తనిఖీలపై లీకులు..**

భీమ్‌గల్ కప్పలవాగులోనూ గుట్టుగా ఇసుక దందా కొనసాగుతున్నది. తనిఖీలకు ఉన్నతాధికారులు వెళ్లినప్పుడల్లా లీకులు బయటికి వస్తున్నాయి. దీనిపై యంత్రాంగానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారులు తనిఖీలకు పురమాయించగానే క్షేత్ర స్థాయిలో వెళ్తే ఎలాంటి హడావుడీ కనిపించడం లేదు. అక్రమార్కులతో అంటకాగుతున్న అధికారులు ముందస్తుగానే తనిఖీల సమాచారం చేరవేయడంతో ఇదంతా జరుగుతున్నదని స్థానికులు చెబుతున్నారు. అధికారులే వాట్సాప్ కాల్స్ చేస్తూ అధికార పార్టీ నేతలకు సమాచారం అందిస్తున్నారు. కోటగిరి, పోతంగల్, బోధన్, రెంజల్ మండలాల్లోనూ ఇదే తరహా వ్యవస్థ నాటుకుపోయింది. బోధన్ డివిజన్‌లో ఇద్దరు సీఐలు, పలువురు ఎస్సైలపై ఇసుక మామూళ్ల విషయంలో ఆరోపణలు రాగా బదిలీలు చేపట్టారు. అయినప్పటికీ పలుచోట్ల తెర వెనుక ఖాకీలు చేతులు కలుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**దొందూ దొందే..**

భూగర్భ వనరులకు సంబంధించిన అధికారం భూగర్భ గనుల శాఖ, రెవెన్యూతోపాటు పోలీసులకు సైతం ఉంది. వీరంతా దొందూ దొందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇసుక వనరులను గుర్తించి అనుమతులను మంజూరు చేయాల్సిన బాధ్యత భూగర్భ గనుల శాఖది. అనుమతి లేకుండా అక్రమ దందా నడిస్తే నియంత్రించాల్సింది కూడా ఇదే శాఖాధికారులు. ఒకవేళ భూగర్భ గనుల శాఖ కళ్లు గప్పి అక్రమార్కులు దందా కొనసాగించినా రెవెన్యూ యంత్రాంగం కూడా రంగంలోకి దిగి నియంత్రణ చేయొచ్చు. ఇందుకు అనేక చట్టాలు ఆ అధికారాన్ని అప్పగించాయి. ఈ రెండు శాఖలు నిద్ర పోతుంటే పోలీసులైనా రంగంలోకి దిగి అక్రమ రవాణాపై చర్యలు తీసుకునే వీలుంది. లేదంటే తనిఖీలు చేపట్టి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలు పట్టుబడితే వాటిని మైనింగ్ శాఖకు అప్పగించి జరిమానా విధించేలా ఉసిగొల్పే అవకాశం కూడా ఉంది. ఇంతటి మహత్తర బాధ్యత తలను మీద వేసుకోవాల్సిన వారు మొద్దు నిద్రలో ఉంటున్నారు.

---

# పెద్దవాగులో ఇసుకాసురుల తిష్ట!

- పొక్లెయిన్‌తో యథేచ్ఛగా తవ్వకాలు
- బట్టాపూర్ పెద్దవాగు నుంచి ఆగని అక్రమ రవాణా
- సీపీ హెచ్చరికలు బేఖాతరు
- ఇసుక ట్రాక్టర్లు ఆపితే అధికారపార్టీ నేతల ఫోన్లు



శుక్రవారం కమ్మర్‌పల్లి మీదుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

ఏర్గట్ల/ మోర్తాడ్, ఫిబ్రవరి 21: ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సీపీ హెచ్చరించినా ఫలితంలేకుండా పోతున్నది. ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామ శివారులోని పెద్దవాగులో ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే గ్రామ కమిటీకి ట్రాక్టర్‌కు రూ.50వేల చొప్పున 34 ట్రాక్టర్లకు రూ.17లక్షలు చెల్లించిన ఇసుకాసురులు..మేమెవరి మాట వినం అన్నట్లుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కూలీలతో కాకుండా పొక్లెయిన్‌తో కూడా ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. శుక్రవారం ఉదయం 6గంటల నుంచే పెద్దవాగులో ఇసుక తవ్వకాలు చేపట్టడం గమనార్హం.

**కండ్లు మూసుకున్న అధికారులు**

తెల్లవారుజామునుంచి సాయంత్రం వరకు ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ట్రిప్పుకు రూ.200 ఎవరి కోసం వసూలు చేస్తున్నారని, అధికారులకు మామూళ్లు చెల్లించేందుకేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కమ్మర్‌పల్లిలో వేబిల్లులు లేకుండా వచ్చిన ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు నిలిపివేయగా, వెంటనే అధికార పార్టీకి చెందిన నాయకులు ఫోన్లు చేయడంతో వదిలేసినట్లు సమాచారం.

## స్పందించారు.. ట్రాక్టర్లను పట్టుకున్నారు..

**సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యారు**

మోర్తాడ్, ఫిబ్రవరి 21: ఏర్గట్ల మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతున్నది. ఇసుక దోపిడీపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'మేమింతే...మా రూటే సెపరేటు'అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఏర్గట్ల తహసీల్దార్ శ్రీలత బట్టాపూర్ వద్ద వేబిల్లులు లేకుండా వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లకు సిబ్బందిని కాపలాగా ఉంచారు. కానీ సిబ్బంది కళ్లుగప్పి ట్రాక్టర్లతో డ్రైవర్లు పరారయ్యారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను మండల మెజిస్ట్రేట్ పట్టుకున్నా పరారయ్యారంటే మండలస్థాయి అధికారుల పరిస్థితి ఏమిటో అర్థమవుతున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రేపు అధికారులపై దాడులు కూడా చేస్తారేమో అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద సమావేశమైన జిల్లా లారీ ఓనర్స్ బిల్డింగ్ మెటీరియల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## పరిమితికి మించి ఇసుక తరలింపు

**రెవెన్యూ ఎంవీఐ, ఇన్‌చార్జి సీపీకి లారీ ఓనర్స్ బిల్డింగ్ మెటీరియల్స్ అసోసియేషన్ ఫిర్యాదు**

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 21 : వేబిల్లులో పేర్కొన్న ట్రిప్పులకు మించి ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని నిజామాబాద్ జిల్లా లారీ ఓనర్స్ బిల్డింగ్ మెటీరియల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి మేరకు ఒక టిప్పర్ పది టన్నుల నుంచి 12 టన్నులు తరలించే అవకాశం ఉండగా, ప్రభుత్వానికి రూ. 4 వేల వరకు చెల్లిస్తారని తెలిపారు. కానీ టిప్పర్‌లో 25 నుంచి 28 టన్నుల వరకు ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఒక ట్రిప్పుతో ప్రభుత్వానికి రూ. 6 వేల నుంచి రూ. 8 వేల వరకు ఆదాయం తగ్గుతున్నదన్నారు. బోధన్ మండలంలోని సిద్ధాపూర్, సాలూరా మండలంలోని మందర్నాలోని ఇసుక రీచ్‌ల నుంచి రోజు 61 నుంచి 70 టిప్పర్ల వరకు ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. నిత్యం 300 నుంచి 400 ట్రిప్పులు తరలించి ఇసుక వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని వెల్లడించారు. దీనిపై ఆర్టీఏ అధికారులు, తహసీల్దార్, ఇన్‌చార్జి సీపీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశామని, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. పవన్‌రెడ్డి, శివారెడ్డి, నగేశ్, ఎస్కె.ఖయూం, ఇమ్రాన్, మాజార్‌పటేల్, నర్సింహ, నవీన్, పాల్గొన్నారు.

---

## వివాహ వేడుకలో విషాదం

- మండపంలో కుప్పకూలిన పెండ్లి కూతురి తండ్రి
- దవాఖానకు తరలిస్తుండగా గుండెపోటుతో మృతి..



కుడిక్యాల బాల్‌చంద్రం(ఫైల్)

కామారెడ్డి,ఫిబ్రవరి 21: మంగళవాయిద్యాలు, మేళతాళాలతో కళకళలాడుతున్న వివాహ వేడుకలో విషాదం నెలకొన్నది. పచ్చ ని పందిరిలో వివాహ తంతు కొనసాగుతుండగా పెండ్లి కూతురి తండ్రి ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన కుటుంబీకు లు, బంధువులు వెంటనే దవాఖానకు తరలిస్తుండగా గుండెపోటుతో మృతిచెందాడు. ఈ హృదయవిదారకర ఘటన భిక్కనూర్ మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. భిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన కుడిక్యాల బాల్‌చంద్రం (58)కు ఇద్దరు కూతుళ్లు కనకమహాలక్ష్మి, కళ్యాణమహాలక్ష్మి ఉన్నారు. పెద్ద కూతురు కనకమహాలక్ష్మి వివాహం శుక్రవారం బీటీఎస్ చౌరస్తా సమీపంలోని ఇంద్రప్రస్థ గార్డెన్‌లో నిర్వహించారు. మండపంలో నూతన వధువు, వరుడు జీలకర్ర, బెల్లం ఒకరి తలపై ఒకరు పెట్టుకున్న తర్వాత పెండ్లి జరుగుతుండగా ఒక్కసారిగా తండ్రి కుడిక్యాల బాల్‌చంద్రం గుండెపోటుకు గురై కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఒక్కసారిగా ఫంక్షన్ హాల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కల్యాణ వేదికపై ఉన్న వారు కన్నీటి పర్యంతమయ్యారు. అంత్యక్రియలు కామారెడ్డిలో నిర్వహించగా..పెండ్లికి వచ్చిన వారందరూ పాల్గొన్నారు. గతంలో కనకమహాలక్ష్మి, కళ్యాణమహాలక్ష్మి అంతర్జాతీయ స్థాయిలో జ్ఞాపకశక్తి పోటీల్లో పాల్గొని అందరి మన్ననలు పొందారు.

*శ్రీనిధి.. కామారెడ్డిలోని ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. రెండ్రోజుల క్రితం స్కూల్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా ఉన్నట్టుండి కుప్పకూలి పోయింది. సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. దవాఖానకు తరలించి చికిత్స అందించే లోపే శ్వాస ఆగిపోయింది. 14 ఏండ్ల బాలిక గుండెపోటుతో హఠాన్మరణం చెందడం అందరినీ విస్మయానికి గురి చేసింది.*

*భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన బాల్‌చంద్రం (58) కామారెడ్డిలో స్థిరపడ్డాడు. శుక్రవారం కూతురి పెండ్లి ఘనంగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శాస్త్రోక్తంగా వివాహ క్రతువు జరుగుతుండగా, పందిట్లోనే బాల్‌చంద్రం కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లే లోపు గుండె ఆగిపోయింది. కూతురు వివాహం చూడకుండానే ఆయన కన్నుమూశారు.*

*తాడ్వాయి మండలంలో పురం లక్ష్మీపతి (38) ఐదు రోజుల క్రితం గుండెపోటుకు గురయ్యాడు. ఇంకా బోలెడంత జీవితం ఉండగానే ఆయన ఆయుష్షు తీరిపోయింది. హార్ట్ స్ట్రోక్ ఆయనను కుటుంబానికి దూరం చేసింది.*




- కుప్పకూలుతున్న జనం
- పిల్లల నుంచి పెద్దల దాకా బాధితులే
- రెండ్రోజుల్లోనే ఇద్దరు హఠాన్మరణం
- కలవరపెడుతున్న ఉదంతాలు
- మారిన జీవనశైలి, జంక్ ఫుడ్డే ప్రధాన కారణం
- మారకపోతే మరింత ప్రమాదమంటున్న వైద్య నిపుణులు

కామారెడ్డి, ఫిబ్రవరి 21: గుండె గుబులు పుట్టిస్తున్నది. ఉన్నట్టుండి ఆగిపోతున్నది. హార్ట్ స్ట్రోక్ అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నది. ఉమ్మడి జిల్లాలో గుండెపోటు బాధితుల సంఖ్య పెరుగుతుండడం కలవరపెడుతున్నది. గత నాలుగైదు రోజుల్లోనే నలుగురు మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ గుండెపోటుకు గురవ్వడం భయాందోళనకు గురి చేస్తున్నది. కామారెడ్డిలో పద్నాలుగేండ్ల బాలిక, తాడ్వాయిలో యువకుడు, కామారెడ్డిలో మరో వ్యక్తి హార్ట్ ఎటాక్‌తో మృతి చెందడం పెను విషాదం నింపింది. ఈ క్రమంలో మన గుండె పదిలమేనా? అన్న ప్రశ్న అందరి మదినీ తొలుస్తున్నది. మారిన జీవన శైలితో హృదయానికి ముప్పు ఏర్పడిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మంచి ఆహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయడం, యోగా, ధ్యానం వంటి వాటి ద్వారా గుండెపోటుకు దూరంగా ఉండొచ్చని సూచిస్తున్నారు.



**మారిన జీవన శైలి..**

నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ కాలంతో పరుగులు పెడుతున్నారు. పని ఒత్తిడితో సమయానికి తిండి, నిద్ర లేక సతమతమవుతున్నారు. చదువు, ఉద్యోగం, కుటుంబ బాధ్యతల నడుమ అనేక రకాల మానసిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. బిజీ లైఫ్‌లో ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. అదే సమయంలో శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు పెరిగి అనేక రుగ్మతలు కొని తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక సమస్యలతో పాటు గుండెపోటుకు గురవుతున్నారు.

**జాగ్రత్తలతోనే ఆరోగ్యం**



మారిన జీవనశైలి వల్ల హార్ట్‌ఎటాక్ కేసులు పెరుగుతున్నాయి. జంక్‌ఫుడ్, మద్యపానం, ధూమపానం వల్ల హృదయ సమస్యలు వస్తున్నాయి. పని ఒత్తిడి, మితిమీరిన టెన్షన్ల వల్ల గుండెపోటు వచ్చే అవకాశముంది. ఏ వయస్సు వారైనా కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. జంక్‌ఫుడ్‌కు, ధూమపానానికి దూరంగా ఉండాలి. రోజూ కనీసం అరగంటైనా వ్యాయామం చేయాలి. మానసిక ప్రశాంతతను అలవర్చుకోవాలి.

**- డాక్టర్ అరవింద్, వైద్య నిపుణులు**

**మన జీవితం మన చేతుల్లోనే..**

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా రోగాలకు దూరంగా ఉండొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. చక్కెర, ఉప్పుతో పాటు కొవ్వు పదార్థాలను తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. కొవ్వు, బరువు పెంచే ఆహార పదార్థాలను వీలైనంత తగ్గించాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలంటున్నారు. ఓట్స్, చిరు ధాన్యాలు, పీచు పదార్థాలు, తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. రోజులో కనీసం అరగంట అయినా వ్యాయామం చేయాలని, యోగా, ధ్యానం చేయడం ద్వారా ఒత్తిళ్లను జయించవచ్చని పేర్కొంటున్నారు. నీళ్లు ఎక్కువగా తాగాలని, తగినంత సమయం నిద్ర పోవాలని సూచిస్తున్నారు. తద్వారా దీర్ఘకాలిక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు.